# కాకతీయ వైభవ దర్పణం

# రామప్ప దేవాలయం



తెలంగాణ ప్రభుత్వం

**భాషా సాంస్కృతిక శాఖ**

కాకతీయ వైభవ దర్పణం

# రామప్ప దేవాలయం



తెలంగాణ ప్రభుత్వం
**భాషా సాంస్కృతిక శాఖ**
కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్

పరిశోధన, రచన:
**డా॥ ఈమని శివనాగిరెడ్డి,** స్థపతి
సీఈఓ – ప్లీచ్ ఇండియా ఫౌండేషన్

సంపాదకులు:
**డా. మామిడి హరికృష్ణ**



కాకతీయ వైభవ దర్పణం

# రామప్ప దేవాలయం

Kakatiya Vaibhava Darpanam

## Ramappa Devalayam


*Research & Written by:*
**Dr. Emani Shivanagi Reddy,** Stapathi
CEO - Pleach India Foundation

*Edited by :*
**Dr. Mamidi Harikrishna**



ISBN No. 978-81-981195-3-7

First Published in May, 2025
Price : Rs. 250/-


© Department of Language & Culture, Govt. of Telangana


అట్టమీద బొమ్మ: రామప్ప దేవాలయం
అట్టవెనుక బొమ్మ: శాసన మండపం


*Published by:*
**The Director**
**Department of Language & Culture**
Ravindra Bharathi, Hyderabad, Telangana State, India.

*Design by:*
**Gadde Tukaram**

*Printed at:*
**Sai Likhita Printers**
Khairatabad, Hyderabad - 500 004.
Ph: 7207045979



కాకతీయ వైభవ దర్పణం

# రామప్ప దేవాలయం

## విషయసూచిక


I. సంపాదకీయం – కాకతీయ వాస్తుశిల్ప రీతికి నీరాజనం 5

II. రచయిత మాట 8

1. కాకతీయులు – పరిచయం – ప్రస్థానం 9
సామంతులుగా కాకతీయులు – స్వతంత్ర రాజులుగా
కాకతీయులు – గణపతిదేవుడు – రుద్రమదేవి

2. కాకతీయుల దేవాలయాలు 17

3. రామప్ప దేవాలయం 20

4. కాటేశ్వరాలయం 44

5. కామేశ్వరాలయం 45

6. శాసనమండపం – రామప్ప శాసనం 52

7. రామప్ప చెఱువు 60

8. రామప్ప శిల్పం... ప్రపంచ సుందరీమణుల ఆశ్చర్యం 62




# List of UNESCO world heritage sites in India





సంపాదకీయం



# కాకతీయ వాస్తుశిల్ప రీతికి నీరాజనం

తెలుగుజాతికీ, తెలంగాణ ప్రాంతానికి భారతీయ చరిత్ర ప్రస్థానంలో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించిన పాలకులలో శాతవాహనుల తర్వాత ప్రస్తుతించతగినవారు కాకతీయులు! కాకతీయ చక్రవర్తులు 1158 సంవత్సరం నుంచి 1323 సంవత్సరం వరకూ దాదాపుగా దక్షిణ భారతదేశాన్ని అంతటినీ ఏలుబడిలోకి తీసుకొచ్చి పాలనలో, వాస్తు శిల్ప రీతులలో, దేవాలయ నిర్మాణ శైలులలో, సాహితీ, సాంస్కృతిక, భాషా పోషణలో తమదైన ముద్రని వేసారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కాకర్త్యగుండ్యన కాలంలో "అనుమకొండలో" తొలి రాజధానిగా మొదలైన కాకతీయ పాలన ఓరుగల్లు రాజధానిగా ఏర్పడే నాటికి దక్షిణాదినంతటినీ తన ఏలుబడిలోకి తెచ్చుకొని విస్తారమైన సామ్రాజ్య పాలనని చేసిన వంశంగా పేరెన్నికగన్నది.

కాకతీయులు వివిధ రంగాలలో ఎన్నెన్నో సంస్కరణాత్మక, విప్లవాత్మక చర్యలు చేపట్టినప్పటికీ మూడు విషయాలలో వారి సేవలు ఎంతగానో కొనియాడదగినవి. అవి (1) నగర నిర్మాణం (Town Planning), (2) చెరువుల నిర్మాణం (Tanks), (3) దేవాలయాల నిర్మాణం (Temples). ఈ మూడు విధాలుగా కాకతీయులు తెలంగాణ ప్రాంతపు, దక్షిణభారతదేశపు భౌగోళిక, నైసర్గిక భూ పరిస్థితులను, భౌమ నిర్మాణ రీతులను (Geomorphological studies)ని ఆధారంగా చేసుకొని విశిష్టమైన సాంకేతిక నైపుణ్యంతో, వ్యవసాయ రంగంలో, నీటిపారుదల రంగంలో, రక్షణ రంగంలో, ఆధ్యాత్మిక, భక్తి రంగంలో, నిర్మాణాలు, కట్టడాల రంగంలో ఎంతో ముందంజ వేసారనేది తేటతెల్లమవుతోంది. ఇక్కడి స్థానిక, భౌగోళిక భౌమ రూపాంతరాలు, పరిస్థితులను, స్థితిగతులను కూలంకషంగా, శాస్త్రబద్ధంగా అధ్యయనం చేసి అర్థం చేసుకున్నారు కనకే ఈ పీఠభూమి ప్రాంతపు భౌమ నిర్మాణానికి అనుకూలంగా, గొలుసుకట్టు చెరువుల నిర్మాణాన్ని ప్రవేశపెట్టారని చెప్పవచ్చు. సహజమైన కొండలను ఆనకట్టలుగా చేసుకొని, అతి తక్కువ వ్యయంతో అతి పెద్ద చెరువులను నిర్మించడం ద్వారా, నీటిని నిల్వచేసే పర్యావరణ హితమైన (Eco--Friendly) నిర్మాణ కౌశలాన్ని వారు ప్రదర్శించారు.

అలాగే శత్రు దుర్భేద్యమైన కోట నిర్మాణంలో కూడా ఆ కాలం నాటికి ఏ కోటలోనూ పాటించని ఎన్నెన్నో రహస్య సూత్రాలను, మెళకువలను పాటించారు. ఎత్తయిన కోట గోడలు దానికన్నా ముందు కందకాలను, నీటితో సరస్సులను, సరస్సులలో మొసళ్ళను పెంచడం ద్వారా శత్రువులు కోటలోకి ప్రవేశించడానికి సాధ్యం కాని స్థితిని సృష్టించారు.

ఇలా మధ్యయుగ కాలపు (13వ శతాబ్దపు) భారతదేశ చరిత్రలోనే కాకతీయులు తమదైన ప్రత్యేకతని చాటుకోవడం విశేషం. దీనికితోడు కాకతీయులు నిర్మించిన దేవాలయాలు, కట్టడాలు వాటిలో ఉపయోగించిన వాస్తుశిల్ప రీతులు, శిల్పసంపద, దానికోసం ఉపయోగించిన శిలల తీరు తెన్నులు అన్నీ ఇప్పటికీ, ఎప్పటికీ చరిత్ర పరిశోధకులకు నిత్యాన్వేషణగానే ఉంటున్నాయి.

కాకతీయులు తమ సుదీర్ఘ మూడు శతాబ్దాల పాలనలో వేయి స్తంభాల గుడి, గణపురం కోటగుళ్లు, పద్మాక్షి ఆలయం ఇంకా మరెన్నో దేవాలయాలను నిర్మించారు. వాటిలో రుద్రేశ్వర స్వామి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన రామప్పదేవాలయం కాకతీయ దేవాలయ నిర్మాణ రీతికి, శిల్పకళా వైభవానికి పరాకాష్టగా చెప్పవచ్చు. పీఠంపై నక్షత్రాకారంలో, వికసించిన పద్మాకృతిలో రూపొందిన ఈ ఆలయానికి "రామప్ప దేవాలయం"గా ప్రఖ్యాతి లభించడం, ఆ పేరు చుట్టూ ఎన్నో ఐతిహ్యాలు, ముఖ్యంగా ఆ రామప్ప ఆలయాన్ని నిర్మించిన శిల్పి పేరిట ఆ దేవాలయానికి పేరు వచ్చిందనే కథనం ఆసక్తి గొలిపే అంశం.

కాకతీయ చక్రవర్తి గణపతిదేవుని సైన్యాధ్యక్షుడు గా పనిచేసిన రేచర్ల రుద్రుడు పాలంపేట ప్రాంతంలో 1213 నిర్మించిన ఈ దేవాలయం ఎన్నెన్నో రకాలుగా విశిష్టతని సంతరించుకొని యునెస్కో వారి "హెరిటేజ్ సైట్"గా సైతం గుర్తింపుకు నోచుకొని ప్రపంచ వారసత్వ చిత్రపటంలో తెలంగాణ ఖ్యాతిని, ఘనతని చాటి చెబుతోంది.

ఇక రామప్ప దేవాలయం, దాని అమరిక ఒక "ఇంజనీరింగ్ మార్వెల్" అని అనిపిస్తుంది. గర్భాలయం, రంగమంటపం, నంది మండపం, చుట్టూ ప్రాకారం, ఇవన్నీ ఒక నిర్దిష్టమైన నిర్మాణ రీతులను కలిగి ఉండి ఈ దేవాలయానికి విశిష్టతను సంతరించిపెడుతున్నాయి. దేవాలయం చుట్టూ ప్రదక్షిణా పథం ఏర్పాటు చేయడం, దేవాలయం ఆకృతి మొత్తం నక్షత్ర ఆకృతిలో, కలువ రేకులు విచ్చుకున్న పద్మాకృతిలో నిర్మాణం అవ్వడం ఒక విశేషం. వీటికి తోడు ప్రదక్షిణ పథం వైపు ఉన్న గోడలపై వరుసగా చెక్కిన శిల్పాలు, వాటి ఆకృతులు ఆకట్టుకునే రీతిలో ఉండటం "గజధార" (అంటే వరుసగా ఏనుగు బొమ్మలు ఒకదాని వెంట ఒకటి వివిధ ఆకృతులలో, భంగిమలలో నడుస్తున్నట్టుగా ఉండడం) వాటి ఎగువన "పద్మ ధార" పేరుతో వికసించిన పద్మాలు, ఆకులతో కూడిన చెక్కడాలు ఉండడం విశేషం.

ఇవే కాకుండా మల్ల యుద్ధ వీరులు, ఇతర మనుషుల ఆకృతులు, దేవతల ఆకృతులు కూడా ఉండడం ప్రధాన ఆకర్షణ. ఈ రామప్ప దేవాలయంలో కనిపించే మరొక విశిష్టతగా దేవాలయ గోడ భాగాన్ని చెప్పవచ్చు. "పాద వర్గం"గా పిలిచే ఈ గోడ నిర్మాణం దేవాలయ గర్భాలయము, "అర్థమండపాల" వరకు నిలువుగా పొడవాటి స్తంభం, దానిపై కలశంతో ఉంటుంది, దానికి పైన "ప్రస్తరం" – అంటే చూరు లాంటి కప్పు నిర్మాణాన్ని ఏర్పాటు చేయడం కూడా విశేషం.

అలాగే గర్భగుడి పైన నిర్మితమైన "శిఖరం", దీని నిర్మాణానికిగాను ఉపయోగించిన ఇటుకలు ఇప్పటికీ ఒక మిస్టరీ! ఈ ఇటుకలు నీళ్లలో తేలే గుణాన్ని కలిగి ఉండడం ఇప్పటికీ అందర్నీ ఆశ్చర్యపరిచే అంశాలే.

రామప్ప దేవాలయం అత్యున్నత శిల్పకళా రీతులకు ఒక ఉదాహరణగా చెప్పవచ్చు. రంగ మండప నిర్మాణ రీతిలో కానీ, రంగమండపంలోని స్తంభాలపై చెక్కిన శిల్పాలు కానీ ఎంతో సునిశితంగా, సున్నితంగా వివరణాత్మకమైన రీతిలో చెక్కడం ఆశ్చర్యం కలుగుతుంది. రంగమంటపం దూలాలు, వాటిపై చెక్కిన దేవతామూర్తులు, రామాయణ, మహాభారత కథల నేపథ్యంలోని సన్నివేశాలని వరుసగా చెక్కిన తీరుకు అభినందించకుండా ఉండలేము.

ఇక రామప్ప దేవాలయంలో ప్రధాన ఆకర్షణగా నిలిచేవి "మదనిక", "నాగిని" శిల్పములు. స్త్రీ సౌందర్యాన్ని, శరీరాకృతిని సర్వాంగ సుందరంగా చెక్కిన ఈ శిల్పాలు నేటికీ, ఏనాటికీ అధ్యయన అంశాలుగానే చెప్పవచ్చు. నాట్యకారులకు నృత్య భంగిమలుగాను, సౌందర్య ఆరాధకులకు సుందర శిల్పాలుగాను, చిత్రకారులకు సుసౌష్టవమైన ఆకృతులుగానూ, ఆధునిక ఫ్యాషన్ డిజైనర్లకు, ఆనాటి జీవనశైలి ఆనవాళ్ళుగాను, ఏ శాస్త్ర విభాగానికి సంబంధించిన పరిశోధకులకు ఆ శాస్త్రపరంగా విశ్లేషించే విస్తృత జ్ఞానాన్ని నిగూఢంగా కలిగి ఉండడం ఈ శిల్పాలలో కనిపించే గొప్ప విశేషం.

అలాగే గర్భాలయానికి ఇరువైపులా ఉండే “ద్వార శాఖలు” వాటి పైన చెక్కిన వివిధ నృత్య భంగిమలు, పేరిణి నాట్య సంప్రదాయ రీతిని చూపించగలిగే ముద్రలు అన్నీ నిత్య పఠనీయాలే! నిరంతర అధ్యయనశీలాలే! దశాబ్దాల కాలం పాటు వీటిని అధ్యయనం చేసిన డాక్టర్ నటరాజ రామకృష్ణ “పేరిణి” నృత్యానికి పునరుజ్జీవనాన్ని ప్రసాదించడానికి రామప్పలోని శిల్పాలే ప్రధాన ఆకరాలు (Sources) అని ఇక్కడ గుర్తు చేసుకోవాలి. అలా శిల్ప సంపద చరిత్ర రచనకు, నిర్మాణానికి ఒక ఆధారంగా (Resource) నిలిచి గ్రంథాలు, శాసనాలు, పురావస్తు ఆధారాల సరసన చేరిందని చెప్పవచ్చు.

ఇలా రామప్ప దేవాలయం వాస్తు రీతిలో, శిల్పకళా రీతిలో, ఆధ్యాత్మిక భక్తి తీరులో, ఆనాటి సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుటుంబపరమైన జీవనశైలిని ప్రతిబింబించే “అనధికారిక చారిత్రక డాక్యుమెంట్”గా నిలవడంలో ప్రత్యేకతను సాధించింది అని ఖచ్చితంగా చెప్పవచ్చు.

ఇలాంటి ఎన్నో విశిష్టతలతో కూడిన రామప్ప దేవాలయ విశేషాలను ప్రముఖ స్థపతి డా. ఈమని శివనాగిరెడ్డి గారు గతంలో 2015 ప్రాంతంలోనే ఒక చక్కని గ్రంథాన్ని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ వారి సహకారంతో ప్రచురించారు. ఆ పుస్తకానికి ఉండే సార్వ కాలీనతని, దానిలో చర్చించిన, చూపించిన ఛాయాచిత్రాలలోని శాశ్వతత్వాన్ని పరిశీలించి ఈ పుస్తకాన్ని కొన్ని మార్పులు చేర్పులతో పునర్ముద్రణ చేయాలని సంకల్పించాము. ఈ అవకాశం భాషా సాంస్కృతిక శాఖకు లభించడం సంతోషం!

ప్రసిద్ధిగాంచిన “ప్రపంచ సుందరి” పోటీలకు తెలంగాణ 2025వ సంవత్సరపు వేదికగా ఎంపిక కావడం, ఆ క్రమంలో మధ్యయుగకాలంలోనే తెలంగాణ ప్రాంతంలో విలసిల్లిన ఫ్యాషన్ విశేషాలు, స్త్రీల సౌందర్యం వంటి అంశాలకు ప్రతీకగా నిలిచే రామప్ప దేవాలయానికి సంబంధించిన ఈ గ్రంథాన్ని ప్రచురించడం సముచితంగా భావిస్తూ, ఈ పుస్తక ప్రచురణలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియచేసుకుంటూ...

**డాక్టర్ మామిడి హరికృష్ణ**
సంచాలకులు
తెలంగాణ ప్రభుత్వం
భాషా సాంస్కృతిక శాఖ

రవీంద్ర భారతి, హైదరాబాద్
22 ఏప్రిల్, 2025





# రచయిత మాట

పరచుకొన్న పచ్చటి తివాచీలాంటి ప్రకృతి ఒడి నడుమ, అందాన్ని మరింత ఇనుమడింపజేసే కొండ సానువుల దిగువభాగాన గల పాలంపేట గ్రామంలో అనువైన ప్రదేశాన్ని ఎన్నుకొని తానుకూడా తన ప్రభువు మాదిరే శివునికి ఒక వినూత్నమైన ఆలయాన్ని నిర్మించాలను కొన్నాడు, రేచర్ల రుద్రుడు. రాజాజ్ఞతో కొత్తపోకడలలో నేర్పరులైన కాకతీయ శిల్పుల్ని అక్కడికి రప్పించాడు. ఆలయ వాస్తుశిల్పులకు తానొక అద్భుతమైన ఆలయాన్ని నిర్మించాలనుకొన్నానని, కాకతీయ సామ్రాజ్యానికే మణిమకుటంగా ఆ దేవాలయం భాసిల్లాలన్న తన తలంపును తెలియజేశాడు. ఇక అంతే సైన్యాధ్యక్షుని ఊహలకు అప్పటికప్పుడు బట్టపై, రూపాన్ని కల్పించటమేకాక కొయ్యతో నమూనా దేవాలయాన్ని చెక్కి చూపించారు. మెప్పుతో కూడిన అంగీకారాన్ని పొందారు. మునుపటి కళ్యాణ చాళుక్య దేవాలయ వాస్తుశైలినే ఎంచుకొన్నా, నిర్మాణం వరకే పరిమితమై, ఎత్తైన ఉపపీఠంలో మరిన్ని వరుసలను చేర్చి, నట్టనడుమ చిన్నదైనా మన్నికగల అధిష్ఠానాన్ని రచించి, ఎత్తైన పాదవర్గం (గోడభాగం)లో మంచబన్దకోష్ఠాలు, అంటే ఒకే కోష్ఠం మూడంతస్తులతో ఉండేట్లు వాటిపైన శిఖరం, కలశాలతో  అలంకరించి, గోడలపై నున్న ప్రస్తరకపోతాన్ని ముందుకు వచ్చేట్లు బాగా వెడల్పుగా తీర్చిదిద్ది, వర్షపునీరు ఏమాత్రం ఆలయభాగాలపై పడకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. అంతేకాదు, కపోతం (చూరు) కిందిభాగాన రకరకాల చట్రాలతో, అలంకరణలతో చిత్ర విచిత్ర కల్పనలను చూపరుల మతిబోయేట్లుగా వడ్రంగులను మైమరపించేలా మలిచారు రామప్ప శిల్పులు. ఇక ఆలయంలోనికి ప్రవేశించగానే అధిష్టానంపై భక్తులు ఆనుకొని కూర్చోటానికి వీలుగా కక్షాసనాలను తీర్చిదిద్దారు. వీటి బయట భాగాన సందర్శకులను మంత్రముగ్ధులను చేసే శృంగార, మైథున, దేవతా శిల్పాలతో పాటు రుషిపుంగవులు, జైన తీర్థంకరుల విగ్రహాలను కూడా మలిచారు. వాస్తు విన్యాసానికి శిల్పాలను మేళవించి ద్వార శాఖలకు మరింత సౌందర్యాన్ని ఇనుమడించారు.

రంగమండప స్తంభాలపై వివిధ నాట్యభంగిమలు, పురాణ, రామాయణ, భాగవత, భారత ఇతివృత్తాలను కళ్ళకు కట్టినట్లు చెక్కారు. స్తంభాలపై కుడం, ఫలికాపద్మాలను, బోదెలను ఎంతో నైపుణ్యంగా తీర్చిదిద్దారు. దూలాలపై కాలనాళికలన్నట్లు అమృతమథనం, త్రిపురాసుర సంహారం, రామ రావణ యుద్ధం, పురాణ బుద్ధుని శిల్పాలను ఎంతో హృద్యంగా చెక్కారు. కప్పురాళ్ళపై వాహనాలపై వున్న దిక్పాలకులు, మధ్యలో నటరాజమూర్తి శిల్పాలు ఇలా ఎవరూ చెక్కలేరన్నట్లుగా మలిచారు. కప్పుపై మూడంతస్తుల ఇటుకరాతి విమానం, దానిముందు శుకనాసి, పైన కలశం అసలు సిసలైన తెలంగాణ దేవాలయ వాస్తుకు అద్దంపడుతున్నాయి.

రామప్ప ఎవరో తెలియడుగానీ, అన్నీతానై అపురూప ఆలయాన్ని సృష్టించిన రుద్రసేనాని మాత్రం చరిత్రలో నిలిచిపోయాడు. ఒక అద్భుతాన్ని మనకు అందించాడు. ఆ అద్భుతం ప్రపంచ వారసత్వ కట్టడాల సరసనజేరి, తెలుగువారికి, ప్రత్యేకంగా తెలంగాణ వారికి విశిష్ట గుర్తింపును తెచ్చి పెట్టింది.

**– ఈమని శివనాగిరెడ్డి**



# 1. కాకతీయులు – పరిచయం – ప్రస్థానం

కళ్యాణి చాళుక్యుల సామంతులైన కాకతీయులు, ముందు అ(హ)నుమకొండ, ఆ తరువాత ఓరు(వరం)గల్లు నుంచి సా.శ.12–14 శతాబ్దాల్లో విశాల తెలుగు భూభాగాన్ని సుభిక్షంగా పాలించారు. దక్షిణాన ఇప్పటి తమిళనాడులోని ఆర్కాటు జిల్లా, కర్నాటకలోని బళ్ళారి, బీదరు జిల్లాలు, ఒడిషాలోని కటక్, ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తరు, దంతెవాడ, మహారాష్ట్రలోని దేగులూరు వరకూ ఎల్లలుగాగల కాకతీయులు, మధ్యయుగ భారతదేశంలో శక్తివంతమైన పాలకులుగా అవతరించారు. సంప్రదాయ వ్యవసాయానికి సాగునీటి వనరులు కల్పించి, వర్తక, వాణిజ్యాలను, కులవృత్తులను, కవులను, కళాకారులను మున్నెన్నడూ లేనంతగా ప్రోత్సహించారు. ప్రజల మనోభావాలను గౌరవించి, వారు తమకి నచ్చినమతాన్ని స్వీకరించి, మెచ్చిన దేవతలకు మొక్కే స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను కూడా ఇచ్చారు. కదనరంగంలోనే గాక, కళాపోషణలోనూ తమదైన ప్రత్యేకతను చాటుకొన్న కాకతీయుల పాలనాకాలం తెలుగు జాతి చరిత్రలో ఒక మహోజ్జ్వల ఘట్టం. శాతవాహనుల తరువాత తెలుగు వారినందరినీ ఒక తాటి పైకి తేవడమేగాక, కవి పండితులను పోషించి, వాస్తు శిల్పాన్ని ప్రోత్సహించి, తెలుగునాట సాంస్కృతిక వికాసానికి విశిష్టమైన సేవలందించారు.



# సామంతులుగా కాకతీయులు

కాకతీయులు మొదట రాష్ట్రకూటులకు, తరువాత కళ్యాణ చాళుక్యులకు సామంతులుగా తెలంగాణలో ఎక్కువ ప్రాంతాన్ని పాలించారు. చరిత్రను తిరగేస్తే కాకతీయ మూలపురుషుడు వెన్నరాజు కాకర్త్య గుండన కుమారుడైన బేతరాజును చాళుక్యచక్రవర్తి అనుమకొండ విషయానికి (జిల్లాలాంటి భూభాగం) పాలకుడిగా నియమించాడు. ఇప్పటి మహబూబాబాదు జిల్లా కొరవిసీమ నుండి కరీంనగర్ జిల్లా శనిగరం వరకూ ఇతని రాజ్యం విస్తరించింది. ఆ తరువాత, మొదటి ప్రోలరాజు కాకతీయ భూభాగానికి వేములవాడ దాకాగల ప్రాంతాలను కలిపాడు. వేములవాడ పాలకుడైన భద్రగుని పారద్రోలి సబ్బిసాయిర (మెతుకు /మెదకు) మండలాన్ని ఆక్రమించాడు. మొదటి ప్రోలరాజు కొడుకైన రెండో బేతరాజు పాలనలో ముదిగొండ చాళుక్య రాజ్యంలోని కొంతభాగం, సబ్బిసాయిర మండలం అంతా కలిసిపోయింది. రెండో బేతరాజు గొప్ప శివభక్తుడు. ప్రోలేశ్వరాలయాన్ని నిర్మించాడు. ఆ తరువాత తన అన్న దుర్గరాజును అధికారం నుంచి తొలగించిన రెండో ప్రోలరాజు, తన ప్రభువైన కళ్యాణ చాళుక్య రెండోజగదేకమల్లుని ఆజ్ఞానుసారం కందూరు చోళులపై దండెత్తాడు. రేచర్ల వంశ సామంతుడైన కామచమూపతితో కలిసి పొలవాస రాజ్యంపై దాడిచేసి మేడరాజు, గుండరాజులను ఓడించి, తెలంగాణా మొత్తాన్ని ఆధీనంలోకి తెచ్చి, కళ్యణీ చాళుక్యుల మెప్పుపొంది వారి సామంతుడుగా బలపడ్డాడు. అంతేకాదు, అతడు తీరాంధ్రలోని పిఠాపురం చాళుక్యుల సహకారంతో వెలనాటి చోడులను కూడా జయించాడు.



# స్వతంత్ర రాజులుగా కాకతీయులు

## రుద్రదేవ మహారాజు (సా.శ. 1158-1195)

రెండో ప్రోలరాజు కుమారుడైన రుద్రదేవుడు స్వతంత్రుడై సా.శ. 1158లో రాజ్యాధికారాన్ని చేపట్టాడు. పొలవాస ప్రాంతంపై పట్టు సాధించి, గంగాధర మంత్రిని సబ్బిసాయిర మండలానికి సామంతునిగా నియమించాడు. కందూరు పాలకుడైన భీమదేవచోడుని జయించి అతని సోదరి పద్మావతిని పెళ్ళాడాడు. ఈ యుద్ధంలో సహకరించిన రేచర్ల బేతిరెడ్డి, నామిరెడ్డి సోదరులను ఆమనగల్లు రాజ్యానికీ, చెరుకు కేతసేనానిని, బొల్లయరెడ్డిని జమ్ములూరు రాజ్యానికీ, గోకర్ణుని కందూరు రాజ్యానికి సామంతులుగా నియమించాడు. రుద్రదేవుడు పలనాటి యుద్ధంలో నలగామరాజుకు సహాయమందించి అతనికి విజయాన్ని చేకూర్చాడు. కృష్ణానదికి ఇరువైపుల గల తీరాంధ్ర ప్రాంతాలు, వెలనాటి రాజ్యంలోని కీలకప్రాంతాల పై రుద్రుడు జరిపిన దండయాత్రల్లో చెరుకు, మల్యాల, రేచర్ల, విప్పర్ల, కొమురవెల్లి సామంత దండనాయకులు పాల్గొన్నారు. సా.శ.1195లో ఉత్తర సరిహద్దుల్లో నున్న యాదవ రాజులతో జరిగిన యుద్ధంలో రుద్రదేవుడు మరణించాడు. అప్పటికి ఉత్తరాన గోదావరినది నుండి దక్షిణాన శ్రీశైలం వరకూ, పడమర బెడదకోట (బీదర్ ) నుండి తూర్పున బంగాళాఖాతం వరకూ కాకతీయ సామ్రాజ్యం విస్తరించింది. స్వతంత్ర కాకతీయ సామ్రాజ్య అవతరణకు గుర్తుగా సా.శ. 1162-63లో రుద్రదేవుడు హనుమకొండలో రుద్రేశ్వర, వాసుదేవ, ఆదిత్యులకు ఒక త్రికూటాలయాన్ని, ఒక మండపాన్ని నిర్మించాడు. ఆ ఆలయం వేయిస్థంభాల గుడి గానూ, 369 స్థంభాలున్న ఆ మండపం కళ్యాణ మండపంగానూ ప్రసిద్ధి పొందాయి. తరువాత సింహాసనాన్ని అధిష్ఠించి కేవలం నాలుగేళ్లపాటే పాలించిన రుద్రుని సోదరుడైన కాకతీయ మహదేవుడు దేవగిరి కోట ముట్టడిలో మరణించాడు. అదే సందర్భంగా యాదవరాజైన జైత్రపాలుడు (జైతుగి), మహదేవుని కుమారుడైన గణపతిదేవుని  బందీగా దేవగిరికి తీసుకెళ్లాడు.





# గణపతిదేవ చక్రవర్తి

**(సా.శ.1199-1262)**

గణపతి దేవుడు యాదవుల బందీగానున్నపుడు కాకతీయ రాజ్యంలోని సామంతులు విజృంభించారు. అప్పటికే కాకతీయల కొలువులో ఉన్న రేచర్ల రుద్రసేనాని (రుద్రిరెడ్డి) చాకచక్యంగా వారిని అణచి, శాంతిని నెలకొల్పి, విరియాల, మల్యాల సామంతులతో కలిసి గణపతిదేవున్ని బంధ విముక్తున్ని గావించి కాకతీయ సింహాసనంపై పట్టాభిషిక్తున్ని చేశాడు. ఒకపక్క శతృవులపై దృష్టి సారిస్తూనే, గణపతిదేవుడు మరోవక్క తన యం(మం)త్రాంగాన్ని బలోపేతం చేసుకొన్నాడు.



సింహాసనమధిష్టించిన తొలినాళ్ళలోనే రాజ్యాన్ని పటిష్టపరచి చుట్టుప్రక్కల భూభాగాలను జయించి సామ్రాజ్యంగా మలచుకొన్న గణపతిదేవుడు, కొత్తగా పట్టణాలు, దేవాలయాలను కట్టించి, చెరువులు త్రవ్వించి కళలకు, కవులకు చేయూతనిచ్చాడు.

తనకు సహకరించిన రుద్రసేనాని శక్తిసామర్థ్యాలను స్వయంగా చూచిన గణపతిదేవుడు, అతన్ని కాకతీయ సర్వసైన్యాధ్యక్షునిగా నియమించాడు. రేచర్ల వంశకర్త బ్రహ్మసేనాపతి, గొప్ప శూరుడు, కాంచీనగరాన్ని జయించి కాకతిరాజ్య రమావల్లభునికి కాంచీ నగర కన్యఅను వీరలక్ష్మితో వివాహ మొనర్చినాడని పాలంపేట శాసనంలో రుద్రుడు పేర్కొన్నాడు. ఈ వంశంలో కాటయ, అతని కుమారుడు కామ చమూపతులు (సైన్యాధిపతులు) ప్రసిద్ధులు. కామచమూపతి మంథెన గుండనను జయించాడు. కామచమూపతి కుమారుడు కాట చమూపతి శివపూజా దురంధరుడు. ఇతని కుమారుడే రుద్రసేనానిగా గుర్తింపు పొందిన రేచర్ల రుద్రిరెడ్డి. రుద్రసేనాని కాకతిరాజ్యం సంక్షోభ స్థితిలో ఉన్నప్పుడు శత్రువుల బారినుండి, సామంతుల తిరుగుబాటు నుండి రాజును, రాజ్యాన్ని కాపాడి 'కాకతిరాజ్య స్థాపనాచార్య' బిరుదును పొందాడు.

సమర్థ సైన్యాధ్యక్షుడుగా గణపతిదేవుని అభిమానాన్ని చూరగొన్న రేచర్ల రుద్రుడు మరోచోట ఎక్కడా లేనట్లు రాజు మెచ్చేట్లు అరుదైన ఆలయాన్ని నిర్మించి చక్రవర్తిని అబ్బురపరచాలనుకొన్నాడు.

గణపతి దేవుడు, నేర్పరి అయిన జాయపసేనానికి సమున్నత పదవిని కట్టబెట్టాడు. అయ్యకులానికి చెందిన జాయపసేనాని పిన్నచోడుని పుత్రుడు. వీరిది వెలనాడులోని కొయ్యూరు. వీరి పూర్వికులు చందవోలును రాజధానిగా చేసుకొని తెలుగు ప్రాంతాన్ని పాలించిన వెలనాటి చోళులవద్ద ఉన్నతోద్యోగాలు చేశారు. జాయపసేనాని తాత నారాయణనాయకుడు, కృష్ణానది సముద్రంలో కలిసే హంసలదీవిలో అతడు ఒక నగరాన్ని నిర్మించాడు. కాకతీయ గణపతిదేవుడు సా.శ. 1203లో దండెత్తి, జాయపసేనాని తండ్రి పిన్నచోడనాయకుని ఓడించి ఈ ప్రాంతాన్ని వశపరచుకొన్నాడు. ఆ తరువాత, వారితో సఖ్యతకొరి పిన్నచోడనాయకుని కుమార్తెలైన నారమ, పేరమలను పెళ్లిచేసుకొన్నాడు. అప్పటికింకా చిన్నవాడైన జాయపసేనానిపై మక్కువ పెంచుకొని, తన మంత్రి గుండామాత్యుని వద్ద కళల్లో శిక్షణనిప్పించినట్లు తాను రాసిన నృత్తరత్నావళిలో జాయపసేనాని తెలుపుకున్నాడు. ఇతన్ని గణపతిదేవుడు, గుంటూరు జిల్లాలోని చేబ్రోలు పాలకునిగానూ, కాకతీయ గజసేనకు అధ్యక్షునిగానూ నియమించాడు.

ఒకవైపు జాయపసేనానిని, మరో వైపు రేచర్లరెడ్డి కుటుంబం నుంచి వచ్చిన రుద్రుని తన కుడి, ఎడమ భుజాలుగా చూచుకొన్నాడు గణపతి దేవుడు అతని కాలంలో సామంతులు, రాణులు, మంత్రులు, సైన్యాధ్యక్షులు, ఉన్నతోద్యోగులు, ధనిక ప్రముఖులు సొంతంగా ఆలయాలను, గ్రామాలు, పట్టణాలు నిర్మించి, చెరువులను, కాలువలను తవ్వించారు. అందుకనే, వారు ప్రభువు అడుగు జాడల్లో నడుస్తూ అనేక ధార్మిక కార్యక్రమాలకు చేయూతనిచ్చి, ఆయా సందర్భాల్లో వేసిన శాసనాల్లో కాకతీయ గణపతి దేవుని కృతజ్ఞతాపూర్వకంగా కీర్తించారు. ఈ దేవాలయాలు మధ్యయుగాల రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, చరిత్రకు అద్దంపడుతున్నాయి.



వెలనాటి పృధ్వీశ్వరుడు మాండలిక రాజులతో కలిసి కాకతీయ రాజ్యభాగాలను ఆక్రమించి, స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు. ఈలోగా మూడో కుళుత్తోంగచోళుడు, ఓరుగల్లుకోటపై దాడికి సమాయత్తమౌతున్నాడు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో రేచర్ల రుద్రసేనాని వ్యూహాత్మకంగా దండయాత్రలను తిప్పికొట్టాడు. తరువాత గణపతిదేవుడు ప్రతీకారంతో వెలనాటి పృధ్వీశ్వరుని ఓడించాడు. రేచర్లరుద్రుని మంత్రి అయిన రాజానాయకుని నేతృత్వంలో, ఇందులూరి సోమన సహకారంతో దిగువ గోదావరి ప్రాంతంలోని కొలను (కొల్లేరు), కోన, చాళుక్య, కళింగ రాజ్యాలను చాకచక్యంతో కాకతీయ రాజ్యంలో విలీనం చేశాడు జాయపసేనాని. ఇందులూరి సోమనను ఆ ప్రాంతానికి సామంతుడిగా నియమించిన గణపతిదేవుడు, చాళుక్య ఇందుశేఖరుడి కుమారుడైన వీరభద్రునికి తనకూతురు రుద్రమదేవినిచ్చి వివాహం చేసి అల్లుణ్ణి కొలనుపాక ప్రాంత పాలకుడిగా నియమించాడు. నెల్లూరు మనుమసిద్ధి రాజ్యాన్ని కోల్పోగా, తిక్కన సోమయాజి చొరవ వల్ల గణపతిదేవుని సహాయంతో అతని రాజ్యాన్ని తిరిగి అతనికిప్పించాడు. తమిళదేశంపై చేసిన దండయాత్రలో కాంచీపురాన్ని స్వాధీనం చేసుకొని, సామంతభోజుడిని అక్కడి పాలకుడిగా నియమించాడు. ఈ రాజకీయం నచ్చని జటావర్మ సుందరపాండ్యుడు, సామంతభోజున్ని కాంచీపుర పాలకునిగా తొలగించి, అతని స్థానంలో విజయగండగోపాలున్ని నియమించాడు. అంతటితో ఆగక నెల్లూరు పాలకుడైన మనుమసిద్ధిని పాండ్యులకు సామంతుడిగా ఉండమని ఒత్తిడిచేశాడు. పాండ్యరాజు, మనుమసిద్ధి, ఈ విషయాన్ని గణపతిదేవునికి తెలియజేయగా, అతడు పంపిన కాకతీయ సైన్యం పాండ్య సేనాని కొప్పెరుంజింగని ఓడించింది. ఈ వార్త తెలిసిన జటావర్మసుందరపాండ్యుడు నెల్లూరును ముట్టడించగా, ముత్తుకూరు వద్ద పాండ్య, కాకతీయ సేనలకు జరిగిన భీకరపోరులో మనుమసిద్ధి మరణించాడు. ఇలా తెలుగు నేలకు నాలుగు దిక్కుల్లో గల భూభాగాలను జయించిన గణపతి దేవుడు గొప్ప చక్రవర్తిగా రాణించాడు.





గణపతిదేవు తరువాత ఆయన కూతురు రుద్రమదేవి సా.శ. 1262 లో కాకతీయ సింహాసన మధిష్ఠించింది. స్త్రీ అయినా రుద్రమదేవి విక్రమ పరాక్రమాలతో శత్రువులకు సింహస్వప్నంగా మారి, అద్వితీయ పరిపాలననందించి, కాయస్థ అంబదేవుని కుటిల నీతికి బలై నల్లగొండ జిల్లా చందుపట్ల దగ్గర సా.శ. 1289లో మరణించింది. తరువాత ఆమె మనుమడైన ప్రతాపరుద్రుడు, కాకతీయ రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకొని సా.శ. 1290 నుంచి చక్కని పరిపాలన అందించాడు. కళ్ళుకుట్టిన ఢిల్లీ సుల్తానులు మూకుమ్మడి దాడుల్లో భాగంగా సా.శ. 1323 లో బందీగా కొనిపోబడుతూ మార్గం మధ్యలో నర్మదా నదీలోకెళ్ళి తనువు చాలించటంతో నాలుగు దిక్కులా వెలుగులు విరజిమ్మిన కాకతీయ సామ్రాజ్యంస్తమించింది. రాజ్యం అంతరించినా వారు కట్టించిన కోటలు, దేవాలయాలు, మండపాలు, చెక్కించిన శిల్పాలు, తవ్వించిన చెరువులు, వేయించిన శాసనాల్లో కాకతీయ రాజస్వ ఠీవిని ఇప్పటికీ చూడగల్గుతున్నాం. అలా సృష్టించిన అనేక దేవాలయాల్లో పాలంపేటలోని రుద్రేశ్వరాలయం (రామప్ప దేవాలయం) ఒకటి.



# 2. కాకతీయుల దేవాలయాలు



తెలంగాణా రీతిని ప్రతిబింబిస్తున్న కాకతీయ దేవాలయాలు 1500లకు పైగానే ఉన్నాయి. తొలితరంలో నిర్మించిన మొగలిచర్ల, సోమశిల దేవాలయాలు సాదాగా ఒక వరుస రాతితో నుండగా, మలితరంలో నిర్మించిన ఆలయాలు రెండు వరుసల గోడలతో విశాలంగా నిర్మించబడినాయి. కాకతీయ దేవాలయాలు ఏకకూట, ద్వికూట, త్రికూట, పంచకూటాలయాలని విభజించారు. ఒకటి, ఎదురెదురుగా రెండు, ఒకటి మధ్యలో, అటూ ఇటూ చెరొకటి చొప్పున మూడు, ఒకటి మధ్యన ప్రక్కన అటూ ఇటూ ఎదురెదురుగా రెండు, రెండు చొప్పున మొత్తం ఐదు దేవాలయాలు చక్కటి ఉదాహరణలు. ఇంకా వరంగల్ కోటలోని కీర్తి తోరణాలు.

ద్వార మండపాలు (రెండంతస్తుల ద్వారమండపం- రామానుజపురం), నందిమండపం (రామప్ప), శాసన మండపం (రామప్ప), కళ్యాణ మండపం (హనుమకొండ, గణపురం), కాకతీయ దేవాలయ వాస్తులో ప్రధానాంశాలు. తొలినాళ్ళలో కళ్యాణ చాళుక్య దేవాలయు వాస్తును అనుసరించినా, స్వతంత్రులైన తరువాత తమకంటూ ఒక ప్రత్యేక శైలిని సృష్టించి ఆలయాలను నిర్మించారు.



హనుమకొండలోని వేయిస్తంభాల గుడి సా.శ. 1163), మంథని, బెజ్జంకి, కొండపర్తి, నందివడ్డెమాను, ముత్తారం, గోదావరి ఖని(జనగాం) కాళేశ్వరం, నిడికొండ, చంద్రవల్లి, వరంగల్, కటాక్షపూరం, రామానుజపురం, బుద్ధపురం, జనగామ, కూసుమంచి, కొత్తపల్లి మరియు వూటుకూరు ప్రధానంగా ప్రస్తావించాల్సిన కాకతీయ దేవాలయాలు.

కాకతీయ రుద్రదేవుని కాలంలో (సా.శ. 1163) హనుమకొండలోని వేయిస్తంభాల గుడిగా పిలువబడుతున్న త్రికూటాలయం రుద్ర, వాసుదేవ, ఆదిత్యుల కోసం నిర్మించబడింది. నక్షత్రాకారపు చిన్న ప్రదక్షిణాపథం, దానిపైన ఒక అధిష్టానం, స్తంభవర్గం, దీని మీద గోడంతా స్తంభాలతో అలంకరించినట్లు కనిపించే విన్యాసం, మధ్య మధ్య దేవతా శిల్పాలు, చిన్న కపోతమున్న ప్రస్తరంతో చూడముచ్చటగా ఉంటుంది. ఇటుకలతో నిర్మించిన పై శిఖరాలు పడిపోయాయి. ఇక లోపలికెళితే, ప్రవేశద్వారానికి ఇరువైపులా కక్షాసనాలు, అర్ధమండప రాతి ద్వారాలపై కిటికీలు, అధ్భుతమైన శిల్పాలతో చెక్కిన రంగమండపం దాని కప్పు, దూలాలపై నటరాజు, నాట్యం చేస్తున్న నరసింహ శిల్పాలు తొలి కాకతీయ శిల్పుల పనితనానికి మచ్చుతునకలు. ఆలయానికి కొంచెం ముందుగా నంది, దాని తరువాత కళ్యాణ మండపం (దానికి 369 స్తంభాలే వున్నా వేయిస్తంభాలగుడిగా పేరొచ్చింది) ఉన్నాయి. రుద్రుని తరువాత నిర్మించిన ఆలయాలకు వేయిస్తంభాల గుడి నమూనా అనటంలో అతిశయోక్తి లేదు.





# 3. రామప్ప దేవాలయం

ఈ దేవాలయానికి నిర్మాణ సహకారమందించింది రేచర్ల రుద్రుడు. అతడు ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించి తన పేర రుద్రేశ్వరుడని పిలుచుకొన్నాడు. ఇప్పుడు రామలింగేశ్వరుడంటున్నారు. అయితే ఇంతకీ ఈ దేవాలయానికి రామప్ప దేవాలయమని పేరెలా వచ్చిందో ఖచ్చితమైన ఆధారాలు లేవు. కొందరు గుడి కట్టిన శిల్పి పేరు రామప్ప అనీ, అందుకే ఆ దేవాలయాన్ని రామప్ప దేవాలయమని పిలుస్తున్నారని గ్రామస్తులంటారు. మరో చిత్రమేమిటంటే రామప్ప శిల్పిని గణపతిదేవుని కూతురు రాణిరుద్రమదేవి ప్రేమించిందనే కట్టు (వట్టి) కథ ఒకటి ప్రచారంలో వుంది. సా.శ. 1261లో సింహాసనమెక్కి 1289లో మరణించిన రుద్రమదేవికి ఆలయ నిర్మాణం పూర్తైన 31-3-1213 నాటికి 77 ఏళ్ళ వ్యత్యాసముంది. బహుశ ఆమె అప్పటికింకా పుట్టిందో లేదో కూడా చారిత్రక ఆధారాలు లేవు. కట్టుకథలను పక్కన పెడితే, గణపతిదేవుని సైన్యాధ్యక్షుడైన రేచర్ల రుద్రిరెడ్డి (రుద్రుడు) పాలంపేటలో సా.శ. 1213లో నిర్మించిన రామప్పదేవాలయం, కాకతీయ దేవాలయాల్లో మణిపూస.







## దేవాలయ అమరిక

రామప్ప దేవాలయం గర్భాలయం, అర్ధమండపం, రంగమండప, నంది మండపాలతో కుడివైపున కామేశ్వరాలయం, కళ్యాణమండపం, ఎడమవైపున కాటేశ్వరాలయాలతో చుట్టూ ప్రాకారంతో నిర్మించబడింది.

# ఉపపీఠం

పీఠమంటే అధిష్ఠానం. దేవాలయం మొత్తం దేనిమీద నిలబడి వుంటుందో దాన్ని అధిష్టానం (ప్రాసాదాదీనివస్తూనిచాధితిష్టంతి యద్ధితత్) అంటారు. అంటే దేవాలయానికి పాదం లాంటిది. ఈ అధిష్ఠానం కింద ఉండే వరుసల్ని ఉపపీఠం అంటారు. రామప్ప దేవాలయ ఉపపీఠం చూడటానికి ఎత్తుగా, చుట్టూ ప్రదక్షిణ చేయటానికి వీలుగా విశాలంగా ఉంది. ఆధారశిల, ఉపానం, పద్మం, పట్టిక, కుముదం, పట్టిక, అధోపద్మం అనే వరుసలుగల ఉపపీఠంపై ఎలాంటి అలంకార శిల్పమూ లేక సాదాగా ఉంది.





## అధిష్ఠానం

ప్రదక్షిణా పథంగా ఉన్న ఉపపీఠంపైగల అధిష్ఠానానికి ఉపానం, కుముదం, కపోతం దానిపైన ఏనుగుల వరుస (గజధార)లున్నాయి. కపోతం వరుస పైమట్టానికి సమంగా గర్భాలయ, అర్ధమండప, రంగమండపాల నేల రాళ్ళు పరచబడినాయి. ఏనుగుల వరుస గల రాయిపై ఏనుగులు మనిషిపై దాడిచేస్తున్నట్లు, గణపతి, భైరవ, గజలక్ష్మి, మల్లయుద్ధవీరులు, సూర్యుడు, మకరం (మొసలి), వ్యాళాలున్నాయి.











## కక్షాసనాలు (ఆనుకొని కూర్చోటానికి వీలుగా నిర్మించిన ఏటవాలు పిట్టగోడలు)

దేవాలయ రంగమండప అధిష్ఠానంపై గల ఏనుగుల వరుసలున్న రాయిపైన నిలువుగా ఒక పిట్టగోడ లాంటి రాయి వుంది. దీనిని కక్షాసనం (ఆనుకుని కూర్చోటానికి) అంటారు. మండపం లోపల ఒక మూడువరుసల వేదిక, దానిపై భక్తులు కూర్చుండటానికి అరుగుగా ఉపయోగపడుతుంది.





తూర్పువైపు ప్రవేశద్వారం నుంచి రంగమండపం అరుగుపైన 20కక్షాసన ఫలకాలున్నాయి. వాటిపై  బయటి వైపు జైనతీర్థంకరులు, డాలు కత్తి పట్టిన యోధులు, నాట్యగణపతి, చామరధారి, విల్లు, బాణం పట్టుకొన్న వేటగత్తె, భటులు, భైరవుడు, గణిక, వేణుగోపాల, మల్లయుద్ధ దృశ్యాలు, సాలభంజిక (కొమ్మను పట్టుకొని వయ్యారంగా నిలబడిన స్త్రీ), నాట్యగత్తెలు, అటూ ఇటూ మద్దెల వాద్యగాండ్లు, నాగిని, సూర్య, శృంగార–మైథున శిల్పాలు, నగ్నంగా వున్న ఋషి పుంగవులు, శివభక్తులు, భటుల బొమ్మలున్నాయి. మధ్యమధ్యలో నాలుగు దళాల పద్మాలు, పట్టీలున్నాయి. ఈ కక్షాసనాలను వెనకగోడగా చేసుకొని రంగమండపంలోపలి వైపున చుట్టూగల ఏడు చిన్న దేవాలయాల్లో రెండింటిలో మాత్రం దేవి, గణపతి విగ్రహాలున్నాయి. కేవలం కాకతీయుల దేవాలయ రంగమంటపాల్లోనే ఇలాంటి చిన్న దేవాలయాలు పరివారాలయాలుగా వుండటం గమనించాల్సిన విషయం.

# పాదవర్గం (గోడ భాగం)

అధిష్ఠానం పైన ఉండే దేవాలయ గోడభాగాన్ని పాదవర్గం అంటారు. రామప్ప దేవాలయ గర్భాలయ, అర్ధమండపాల వరకూ వున్న గోడభాగం, కింద వేదికతో, పొడవాటి స్తంభభాగం, దానిపైన కలశం, ఫలిక, పద్మం, పోదిక (బోదె) వున్నాయి. అడ్డంగా చూస్తే ఒకవైపు నుంచి మరోవైపుకు కర్ణకూటం, అహార, పంజర, ముఖశాల, మళ్ళీ పంజర, అహార, కర్ణకూటాల అమరిక వుంది. ముఖశాల మధ్యభాగంలో మూడంచెలున్న కోష్టం, దానిపై శిఖరం, కోష్టం పక్క గోడలకు స్వస్తిభద్ర కిటికీలు, ఒక్కో అంచెకు కపోతం, వ్యాళ వర్గాలున్నాయి. కోష్టం కింద గజధార, దానికింద యథావిధిగా అధిష్ఠానం ముందుకు పొడుచుకొచ్చాయి. కుముద భాగం మధ్యలో చక్కటి నంది విగ్రహం వుంది. నంది కేవలం శివుని వాహనమే కాదు, వ్యవసాయానికి తోడ్పడి, తిండి గింజలందించేదిగాబట్టి దానిపట్ల కాకతీయులు మక్కువ పెంచుకొన్నారు. గర్భాలయ గోడల ముఖశాల మధ్యలో మూడువైపులా మూడు కోష్టాలున్నాయి. కర్ణకూట, అహార భాగాల్లో రెండు స్తంభాల కోష్ఠాలపై మూడంతస్తుల విమానముంది.



## ప్రస్తరం (చూరుగల కప్పు)

గర్భాలయం, అర్ధమండపం, రంగమండపం గోడలపై వర్షం నీరు పడకుండా బాగా వెడల్పైన ప్రస్తర కపోతముంది. కిందనుంచి చూచేవారికి కొయ్యతో బాడిసె ఉలిపెట్టి పట్టీలు,బద్దెలు, చివర చూరునుంచి వర్షపు బిందువుల మాదిరి బొంగరం లాంటి రాతి బుడిపెలను చెక్కారు. ఈ బుడిపెలనే సమరాంగణ సూత్రధారమనే శిల్పశాస్త్రాన్ని రచించిన భోజమహారాజు (సా.శ. 11వ శతాబ్ది) ఝూరావళి అని పిలిచాడు. అంటేచూరు నుంచి చిటుక్కు చిటుక్కుమనే రాలే వానచుక్కలని అర్థం. కపోతం కింద, ఉత్తరమనే (దూలం) వరస ఉంది.



## శిఖరం (విమానం)

కప్పు వరకూ రాతితో కట్టిన రామప్ప దేవాలయ ప్రస్తరం పైన ఇటుకలతో కట్టిన మూడంతస్తుల విమానముంది. అనేక రకాల కొలతలతో నిర్మించినందున దీన్ని విమాన (నానా మానవిధానత్వాత్ విమానం పరికల్పయేత్) మన్నారు. కాకతీయుల కాలపు విమానం శిధిలమైతే ఏభై ఏళ్ళక్రితం పునర్నిర్మించారు. కూటకోట లక్షణంతో, ద్రావిడ పద్ధతిలో కట్టిన చదరపు నాగరశైలి విమాన శిఖరం పైన అందమైన కలశముంది. విమానం ముందు భాగాన అర్ధమండపంపైన రెండో అంతస్తు వరకూ ఉన్న కట్టడాన్ని శుకనాసి (చిలుకముక్కు) అంటారు.

## నీళ్లపై తేలే ఇటుకలు...

సకల విద్యాప్రవీణులు, ప్రయోగశీలురైన రామప్పశిల్పులు అప్పటికే పెద్దపెద్ద బండరాళ్లతో బరువెక్కిన దేవాలయ గర్భగుడిపై విమానాన్ని నీళ్లలో తేలే ఇటుకలతో నిర్మించి, నిర్మాణరంగంలో యావత్ భారతదేశంలోనే తమకెవరూ సాటిరారన్న విషయాన్ని రుజువు చేశారు. బాగా పొడిగొట్టిన బంకమట్టికి తుమ్మ చెక్క, కరక్కాయతొక్కలతో ఆడించిన నీళ్లను, వట్టివేళ్లను, ఊకను కలిపి పోతపోసి కాల్చటాన ఆ ఇటుకలు అంత తేలికైనాయి. ఇది కాకతీయ ఇటుకల ప్రత్యేకత.





# రంగ మండపం

రామప్ప దేవాలయ గర్భగృహం, అర్ధమండపం తరువాత గల చదరపు మండపాన్ని రంగమండపమంటారు. దీనికి మూడువైపులా భక్తులు లోనికి రావడానికి దారులున్నాయి. దేవుని విగ్రహానికి చేసే అలంకరణలను అంగభోగమని,రంగశిలపైనుంచి అర్పించే నాట్యాన్ని రంగభోగమనీ రెండింటినీ కలిపి అంగరంగ భోగాలని అంటారు. ఈమండపంలో మధ్యన ఎత్తైన నాలుగు ప్రధాన స్తంభాలు, చుట్టూ వేదిక మీద కురచస్తంభాలు వున్నాయి. కపోతం వంగిపోతుంటే అప్పటి పురావస్తు శాఖ సంచాలకులు డా. గులాం యాజ్దాని 1940లో చుట్టూ సాదాగా చెక్కించిన రాళ్ళతో స్తంభాలెత్తించాడు. దానిపై నున్న వ్యాళ వర్గం శిథిలమైతే దాన్ని కూడా రాతితో పిట్టగోడ మాదిరిగా కట్టించాడు. నిజానికి కాకతీయుల పిట్టగోడ, ప్రధాన ఆలయాన్ని పోలిన చిన్న ఆలయాల వరుస వుంటుంది.



# రంగ మండప స్తంభాలపై శిల్పం

రంగమండపం మధ్యనున్న నాలుగు స్తంభాలు, దూలాలు, కప్పు రాళ్ళను నల్ల శానపు రాతితో ముఖం కనిపించేంత నగిషీగా చెక్కారు. ఆగ్నేయంలో వున్న స్తంభానికి కింద అశ్వపాదం, స్తంభభాగం, దానిపై నాట్య గణపతి, ఎకచెక్కాలాడుతూ శృంగారం భంగిమల్లో నున్న దంపతులు, ఒక సైనికుడు, అతని భార్య (బహుశ రామప్ప దేవాలయ నిర్మాత రేచర్ల రుద్రసేనాని అతని భార్య) నాట్య గత్తెలున్నారు. నైరుతిలోనున్న స్తంభంపైన నాట్యగత్తెలు, రతీమన్మధ, అమృతమథన దృశ్యాలు, వాయువ్య స్తంభం మీద గోపికా వస్త్రాపహరణం, నాట్యగాళ్ళు, ఈశాన్య స్తంభంపై చక్కటి డిజైన్లు వున్నాయి. స్తంభాలపైన కలశం, దాడి, ఫలికా పద్మాలను బంగారు పనిచేసే కంసాలులు తీర్చిదిద్దారా అన్నట్లుంది. దానిపై నాలుగు వైపులా నాలుగు ముఖాలున్న బోదె లున్నాయి









## రంగ మండప దూలాలు

బోదెలపైనున్న గల దూలాలపైన వెన్నతో తీర్చిదిద్దినట్లుగా లెక్కలేనన్ని దేవతా మూర్తుల్ని సులువుగా చెక్కారు రామప్ప శిల్పులు. తూర్పు వైపు దూలం ఎదురుగా కల్యాణసుందరమూర్తి, దూలం కిందవైపున(బ్రహ్మ, విష్ణువుల మధ్య నర్తనమాడుతున్న నటరాజు, ఏకాదశ రుద్రులు, లోపలి వైపు త్రిపురసంహారమూర్తి, దక్షిణంవైపు దూలంపై ఎదురుగా, నందీశ్వర, బ్రహ్మ, విష్ణు, వాహనాలపైనున్న దిక్పాలకులు, సప్తర్షులు, దూలం కిందవైపు న గజాసురసంహారమూర్తి, లోపలివైపు అమృతకలశానికి అటూ ఇటూ దేవతలు, పడమర



దూలం ఎదురుగా దేవతా శిల్పాలు, దూలం కిందవైపున దిక్పాలకుల మధ్య నటరాజు, లోపలి వైపు సాగరమధన దృశ్యం, ఉత్తరం వైపున దూలంపై ఎదురుగా రుషులు, కిందవైపు గజాసుర సంహారమూర్తి,లోపల రామరావణ యుద్ధ దృశ్యాలపే రమణీయంగా మలిచారు. దూలాలపైన మధ్యలో (మూలరాళ్ళు) కోణవట్ట, చదరవట్టాల (చదరపు రాళ్ళు)పై దిక్పాల శిల్పాలు, మధ్యన నటరాజశిల్పం చూపరుల దృష్టినిమరల్చటమే కాక మెడనొప్పిని కూడా కలిగిస్తుంది. ఎందుకంటే ఏ శిల్పానికి ఆ శిల్పం అద్వితీయం! అపురూపం!!





# అందరి దృష్టినీ ఆకర్షించే మదనిక-నాగిని శిల్పాలు

రంగమండపం కక్షాసనాల వెనుక వేదికపై నిలబెట్టిన కురచస్తంభాలున్నాయి గదా! వాటి వెలపలి వైపు నుంచి దూలాల బోదె భాగాల్లోకి నల్ల శానపురాతితో చెక్కిన ఏనుగుపైనున్న యాళి – గజకేసరి (సింహాన్ని పోలిన ఊహాత్మక జంతువు) శిల్పాలు, నాగినీ, మదనికా శిల్పాలున్నాయి. చక్కటి అంగసౌష్టవంతో వొంపుసొంపులు, హొయలూ, వయ్యారాల కలవబోతగా తీర్చి దిద్దిన అలనాటి సుందరీమణులు కాకతీయుల కాలపు అందమైన యువతుల రూపలావణ్యానికి ప్రతిబింబాలు. రంగమండప వాయువ్య భాగంలో నల్లశానపు రాతిలో చెక్కిన ఐదు గజకేసరి శిల్పాలు, తరువాత తూర్పు ద్వారానికి రెండు వైపులా ఇద్దరేసి నాట్యగత్తెలు, నాగినులు, మద్దెల వాయిస్తున్న యువతులు, తూర్పువైపు ద్వారానికి ఎడమవైపున్న ఒక యువతి ఎత్తు మడమల చెప్పులతో ఫ్యాషన్లలో ఫ్రెంచి అందగత్తెల్ని తలదన్నే రీతిలో ఉంది.

మరో యువతి వంటిపై జారిపోతున్న అంబ్రాయిడరీ అల్లికలు, అప్పటికి కొంగొత్త డిజైన్లు అద్దుకున్న బట్టలతో అందమంతా తన సొంతమేనన్నట్లు ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ సుందరీమణులు తలపై వెంట్రుకలను అందంగా అలంకరించుకొన్నతీరు, చెవులకు పెద్దసైజు గుండ్రటి దుద్దులు, నాజూకైన బంగారు నగలు, నాట్య భంగిమలు, ఆ సొగసుగత్తెల మాటేమోగాని, చేయి తిరిగిన శిల్పుల పనితనానికి నిదర్శనాలు. అంగాంగానికి పొందుపరచిన ఆభరణాలతో అప్సరసలను సైతం కవ్వించి, అలంకరణలో, అందంలో తమకు సాటిరారన్న గర్వంతో సవాళ్ళు విసురుతూ, తెలంగాణా ప్రాంత యువతులు మొదటి నుంచి ఆధునిక నాగరికతకు, ప్రేమికులనీ, సౌందర్యోపాసకులని రుజువుచేస్తున్నారు.









## ద్వారశాఖలు

గర్భాలయంలో ప్రతిష్టితమైన రుద్రేశ్వరుని దర్శించాలనుకొన్నా, ఒకటీ రెండూ శృంగార శిల్పాలు అందరిదృష్టిని ఆకర్షిస్తాయి. అపురూపంగా చెక్కిన ద్వారబంధాలు, వాటి శాఖలు, కింద సుందరమైనశిల్పాలు, వేటగత్తెలపాట్లు, లోనికి వెలుతురు రావటానికి కిటికీలు, కిటికీ కళ్లపై అలనాటి నాట్యభంగిమలు (కరణాలు) అభినయ, నృత్యరీతులు చూపరులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. బహుశా రేచర్ల రుద్రుడు తన నాట్యాభిరుచిని ఇక్కడ తెలియజెప్పు కొన్నాడేమో! ద్వార బంధాల కిందున్న గడపపై రమణీయ శిల్పం, పైనున్న పతంగంపై నటరాజు తాండవం చూపరులను మమేకం చేస్తుంది.



క్కడ మలచిన నాట్య భంగిమలను పరిశీలన చేసి పరిశోధించిన ఎన్నో నాట్య విశేషాలను ం. నటరాజరామ కృష్ణ బయటి ప్రపంచానికి తెలియజెప్పటానికి 1985లో రామప్ప దేవాలయ ాంగణంలో పేరిణి నృత్యప్రక్రియను వేలమంది సమక్షంలో ప్రదర్శించారు. మనం మరచిన లంగాణ నాట్యరీతిని మళ్లీ బతికించి మనకందించారు.











## నంది మండపం



దేవాలయ దర్శనమైన తరువాత రంగమండపం బయటికొచ్చిన వారికి, తంజావూరు బృహదీశ్వరాలయంలో మాదిరిగా వ్యవసాయం పట్లమక్కువ గల కాకతీయ రాజుల అభిమతానికి మచ్చుతునకగా, దుక్కిటెడ్లపట్ల గల మమకారాన్నంతా కలిపి చెక్కించుకొన్న నందిని ప్రతిష్ఠించిన నందిమండపం, అటు అంతకుముందు కళ్యాణి చాళుక్యుల దేవాలయాల్లోగానీ, లేక అప్పటివరకూ కట్టిన కాకతీయదేవాలయాల్లో గానీ ఎక్కడా లేనట్లు విలక్షణ వాస్తుశైలిలో నిర్మించారు ఈ నంది మండపాన్ని. హుందాగా పడుకున్న నంది మెడలో, గంటల పట్టెడలు, వంటిపై, నగలను, శిల్పులూ–కంసాలులూ కలిపి చెక్కరా అన్నట్లున్నాయి. వ్యవసాయ కుంటుంబంనుంచి వచ్చిన రేచర్లరుద్రుడు, దుక్కిటెద్దుల పట్ల గల మమకారాన్ని ఈ నంది అలంకరణ రూపంలో వ్యక్తం చేసుకున్నాడేమో!



# 4. కాటేశ్వరాలయం

రామప్ప దేవాలయానికి ఎడమ వైపుగా, అర్ధమండప, మహామండపాలతో నున్న కాటేశ్వరాలయాన్ని రుద్రసేనాని తన తండ్రి గర్భాలయం, కాట్రెడ్డి పేర నిర్మించాడు. చుట్టూ చిన్న ప్రదక్షిణ పథంగా వున్న ఉపపీఠం, దానిపై చిన్న అధిష్టానం దానిపై వరుసగా పాదవర్గం, ప్రస్తర కపోతం, దానిపైన ఒక్క అంతస్తు వరకు మిగిలి వున్న ఇటుకరాతి శిథిల శిఖరం, కొంచెం ఎత్తైన అధిష్టానం, దానిపై కక్షాసనాలతో ఉన్న రంగమండపం, ప్రవేశం దగ్గర అటూ ఇటూ శిథిలమైనా పదిలంగా మెట్లెక్కండని భక్తులను ఆహ్వానిస్తున్న రెండు చూడముచ్చటగా ఉంది, చిన్నదైనా, ఆ ఆలయం రంగమండపంలో 16 స్తంభాలు, ద్వారబంధాలపై స్వస్తిభద్రజాలకాలతో రామప్ప ప్రధానాలయానికి తగ్గట్టుగా నిర్మించబడింది. ముందున్న మెట్లకు అటూ పొందికగా వున్న అధిష్ఠాన భాగాలను సంస్కృతంలో గజహస్తాలనీ, ఆలంబనబాహులనీ అంటారు.

# 5. కామేశ్వరాలయం

రామప్ప దేవాలయానికి నైరుతి దిక్కులో నిర్మించిన కామేశ్వరాలయం చిన్న ఉపపీఠం, సాదాగోడలు, దానిపై చిన్న కపోతం, వ్యాళ వర్గాలున్నాయి. ముందుభాగంలో అటూ ఇటూ రెండు కక్షాసనాలుండటం గమనించదగ్గ విషయం. చక్కటి చిక్కటిశిల్పాల కల్పనతో ద్వారబంధాలు కాకతీయ శిల్ప కళా వైశిష్ట్యాన్ని తెలియజేస్తున్నాయి.



# కల్యాణమండపం

రామప్ప ఆలయ దక్షిణ భాగంలో, ప్రాకారం పక్కనే నిర్మించిన కల్యాణమండపం శిథిలమైపోగా భారత పురాతత్త్వ సర్వేక్షణ శాఖ పదిలపరుస్తుంది. ఆలయానికి మునుపటి శోభను సంతరిస్తుంది.





## ప్రాకారం

ఆలయాలను అపురూపంగా కట్టించిన రేచర్ల రుద్రుడు వాటి భద్రతనుగురించి కూడా ఆలోచించాడు. అందుకోసం పచ్చటిపరిసరాల నడుమ అందం ఇనుమడించేటట్లు (రక్షార్థ మున్నతార్ధంచ శోభనార్థం ప్రాకారం ప్రకల్పయేత్) చుట్టూ ఎత్తైన విశాలమైన ప్రాకారాన్ని నిర్మించాడు. తూర్పు, పడమర, దక్షిణ దిక్కుల్లో ప్రవేశ ద్వారాలను కల్పించాడు. ప్రాకారం దృఢంగా ఉండటానికి రెండు వరుసలతో గోడను కట్టి, ఆ వరుసల మధ్య మట్టితో నింపి, పైన కప్పునూ, దానిపై అందంకోసం కలశాలను తలపించే కోడిపుంజు జుట్టు రీతిలో నిర్మించాడు.





## ఇతర దేవాలయాలు

రామప్పకు నైరుతి దిక్కులో 100 గజాల దూరంలో ఒక త్రికూటాలయం, వాయువ్యంలో రేగిరానాగరికత శైలిలో నిర్మించిన ఆలయం, చెరువుకట్టపై కుడివైపు కొండగట్టున మరో ఆలయం, చెరువుకట్ట ఎడమవైపుశ్రీ ఒక త్రికూటాలయం, మరో ఏక కూటాలయాలు శిథిలమైనా చూడదగ్గ సమకాలీన సుందర కట్టడాలు.

అపురూపమే కాక అరుదైన రామప్ప దేవాలయ సముదాయం కాకతీయ రాజవంశ రీవికి, వాస్తు శిల్ప వైవిధ్యానికి నాటి శిల్పుల హస్తకళా లాఘవానికి అద్దంపడుతూ ప్రపంచ వారసత్వ కట్టడాల జాబితాలో చోటుదక్కించుకొని తెలుగు వారి గౌరవాన్ని ప్రపంచ వ్యాప్తంగావించింది.












# 6. శాసన మండపం – రామప్ప శాసనం

గణపతి దేవుని అడుగుజాడల్లో నడుస్తున్న రేచర్ల రుద్రుడు, ఆలయాన్ని కట్టిన సందర్భంగా సంస్కృతంలో 204 పంక్తుల శాసనాన్ని ఒక నల్ల శాసనపు రాతి స్థంభంపై చెక్కించి, ఎండా వానల నుంచి రక్షణకు ఒక మండపాన్ని కట్టించాడు. చక్కటి ఉపపీఠంపై నాలుగు స్తంభాలు, పైన అందమైన కప్పుతో నిర్మించిన శాసన మండపం కాకతీయ వాస్తు కట్టడాల్లో విలక్షణమైనదిగా గుర్తింపు పొందింది.





# -:శాసనాలు:-

మొదటి వైపు



రెండో వైపు



మూడో వైపు



నాల్గో వైపు



## -:శాసనం:-:

# మొదటి వైపు:

1. శ్రీ రుద్రేశ్వరాయ నమః ॥ పాయాద్వస్స
2. గణాధీశో యత్కపోలే మదాంబునా
3. సిక్తేళిపత్తిః కస్తూరీ పత్రలేఖాయతే
4. స్ఫుటం॥ (1) దేయాద్వ స్సవ్వరిదాదేవీ శార
5. దా వరదాముదం ॥ దేవదానవ సందోహ
6. వంద్యమానపదాంబుజా॥ (2) యత్పాద పద్మ
7. యుగళే ప్రణతామరేంద్ర కోటీర నీలమ
8. ణిలోల మరీచిజాలం । ధత్తే భ్రమద్భ్రమరవిభ్ర
9. మ మిందుమౌళి ర్దేవశ్శివస్సభవతాద్భవతాం
10. విభూత్యై॥ (3) లీలాకోలః సభవతువిభుః శ్రీపతిః శ్రే
11. యసేవః సర్వ్వైవ్యాప్తా జలధి సలిలై స్వేదబిందూ
12. సమానైః ॥ దంష్ట్రాకోటౌ నిహిత వసుధాయత్త
13. నురార్భతి చంద్రలేఖా కోటిస్థితజలధరా భూరి
14. తారా యధాద్యౌ (4) శ్రీమద్గణపతి క్షోణీపతి జర
15. యతి జిత్వరః । యచ్చిత్తేపివసం నీశీ సముం
16. చ త్యచలస్థితిం । (5) ప్రస్థానే యస్యవాజివ్రజఖు
17. ర దళితా దుస్థితా భూమిభాగా ద్భాతీస్ఫీతాను
18. కూల ప్రసృతపవనతో ధూళిరగ్రే వ్రజంతి । ప్రి (పృ)
19. ధ్వీ తేనానువేలం నిఖిలనయ విదా రక్షితా త
20. త్రియాతం తద్వైరి క్షోణిపాలాన్ స్వయమి
21. వ రభసాహంతుమగ్రే ప్రయాంతి॥ (6)
22. సేవార్థమాగత మహీపతి వాహనేచ హస్తా
23. గ్రని (స్సు) త పయః పృషతాభిషిక్తః॥ తీవ్ర నిదాఘ
24. సమయేపి సుశీతగాత్రో లోకోమదీయచ
25. వనాంగణ దేశవర్తీ (7) యద్దత్తాననవిత్తప్రక
26. (టి)తవిభవ ప్రీత విప్రేంద్ర సంఘ ప్రారబ్ధానేక
27. యజ్ఞ ప్రచురతర హవిఃప్రాప్తిజాతప్రమోదః
28. దేవవ్రాతస్యహవ్య ప్రకరవహనతః ప్రాప్త భూ
29. రిప్రయాసః సౌఖ్యం దుఃఖినమానం కళయ(త్రి)
30. మిళితం సర్వదా హవ్య వాహః॥ (8) తద్భక్తస్య ప్ర
31. వీరస్య శ్రీమద్రుద్ర చమూపతేః॥ రేచెర్లస్వా
32. మినోవంశం వక్ష్యే విఖ్యాతముత్తమం ॥ (9) శ్రీమ
33. దమ్మాఖ్యసేనానీరభూ ద్భూరి గుణాన్వితః ॥ ని
34. జప్రతాపప్రాకార పరిత్రాత మహీతలః (10) తూ
35. ర్యప్రణాద సమనంతరమేవ తూణ్ణమాక్షి
36. ప్యయో యవనికా సదృశం కవాటం కాంచీపు
37. రస్య సమపాదయ దాశు వీరలక్ష్మీ వివాహ
38. మిహ కాకతి వల్లభస్య॥ (11) తత్కులే ద్విపతాం జేతా
39. కాటయాఖ్య శ్చమూపతిః? విచిత్ర సంపదాం



40. పాత్రం ప్రసూతః సజ్జనప్రియః ॥ (12) ప్రహ్వబ్రహ్మ
41. ప్రముఖ నిఖిలా మత్యం కోటీర కోటిస్యూత
42. స్ఫీత స్ఫురదురు మణిశ్రేణి శాణప్రకాశంం
43. శ్రీ కంఠ శ్రీపద జలరుహంసేవతేస్మప్రకా
44. మం ప్రీత్యాయస్య స్ఫుటమహరహశ్చిత్త
45. మత్త ద్విరేఫః॥ (13) తత్పుత్ర శ్చిత్ర చారిత్రః కామ
46. నామా చమూపతిః॥ లోకనాథ పదాంభో
47. జ పూజానిర్మల మానసః (14) శ్రీమత్రోలన్న
48. పాలసైన్యపతినా విఖ్యాత విశ్రాంతినా యుద్ధే
49. యేన మహాబలేన నిహతే మంథన్య గుండా
50. ధిపే॥ అన్యే వైరినృపాలకాః ప్రతిదిశం ప్రాదు
51. ధ్రువం స్తణాత్సింహేనేవ నిపాతితే గజపతౌ
52. శేషా గజాః క్షుద్రకాః॥ (15) తస్మా త్కాటయసేనాని
53. స్సూనుః సూనృతభాషణః॥ జాతః శూరస్తుతా
54. వక్ర పరాక్రమ విభూషణః। (16) గుణమణి
55. గణ సింధుర్య స్సుతా మేక బంధు ర్విఁతర
56. ణ సురవృక్షః శాతి తారాతిపక్షః। ప్ర
57. థితవిమల బుద్ధిః సాధితాభీష్ట సిద్ధిః స్తు
58. త పశుపతి మూర్తి9: సన్నుతానంతకీర్తి9ః॥ (17)

## రెండవవైపు:

59. తస్మాజ్జాతో రిపూంజేతా శ్రీమద్రు
60. ద్ర చమూపతిః॥ రోహణాదిన శైలే
61. ంద్రా ద్వైడూయ్య9మణిరుజ్జ్వల: (18) మేరౌ
62. స్థైర్యం మమాద్దరివే మనసిజే సౌందయ్యం
63. మీశద్రుహే। గాంభీయ్యడం విషజన్మ వే
64. శ్మని సరింనాధే సురక్ష్మారుహే। దానం
65. (ధీ)నదురాసదే కమళభూ స్సృష్ట్వా తద
66. ప్రీతితో దోషాస్స్పృష్టగుణాకరం యమ
67. సృజ త్కామాంబికా నందనం ॥ (19) వీరారాతి
68. నృపాంధ కారతరణే య్యస్య ప్రతాపాత
69. పః ప్రత్యర్థి ప్రమదా లసన్ముఖ సరోజాత
70. ప్రజం మానతాం॥ ఆశ్చయ్యడం కురుతేత
71. రాం ప్రియతమ ప్రాప్తి ప్రమోదాన్విత
72. స్వాతస్వవ్వరి నితాక్షికైరవవన ప్రోత్ఫు
73. ల్లతాంచ స్ఫుటం॥ (20) శ్రీమద్రుద్ర నరాధిపే
74. రిపు మహీపాలాద్రి వజ్రే దివం యాతే
75. కాకతినాథ భోగ్యవిలన త్రి(త)ధ్వీకరా
76. కర్షణే? సంభ్రాంతాః సమముస్థితాః



77. సరభసం వైరి క్షమా పాలకాః యే
78. (........ ర)గణేషు విజితా విఖ్యాతా
79. (విక్రాం)తినా॥ (21) ఊద్దండమండళికతో...
80. (గశిరో) వఖండ్య తుంగధ్వజాగ్రనిహి
81. తం ప్రకటం స్వభర్తు॥ పుయ్యాం (న్య)వేశ
82. య దశేష సమృద్ధి సస్య క్షేత్రేరిభూ
83. పతి మృగ ప్రజభీత యేయః॥ (22) యత్సే
84. నాధ్వజదండాగ్ర పతాకాభిః ॥ ప్రతజ్జి9
85. (తః) దృతం నాగతి భూపాలః పలాయ
86. (న) పరోభవత్॥ (23) శూరః స్వామిహితః సు
87. నిశ్చిత మతిర్యః కాకతీశః శ్రియా పా
88. దే భూరిషు కంటకేషు నిహితే తీక్ష్షేషు
89. మోహాణం తైర్ విధ్యే వ్యథితేచతా
90. న్భుజబలా దు(ధృ)త్యపిష్ట్వా హతాత్తా
91. మస్థాపయ దవ్యథాం స్థిరతరం
92. రేచెర్ల రుద్రస్వయం॥ (24) సింహాసనం
93. మండళికాభిధానం య
94. ద్వంద్వమతీవ శుభ్రం॥ సం.....
95 .............. ధీరో లభతస్వభత్తు9ః సం ...
96. దాత్మ పరాక్రమేణ॥ (25) యద్భా(ణాస్స)
97. మరాంగణేషు నిహితాః ప్ర(త్యత్తి9ప్ప)
98. ద్వీపతీ ర్నిఖ్భివిద్యాపథిషక్తరక్తవ (పుషా)
99. రాజంతి నమ్రానసనాః॥ అస్మద్దర్మ మాత్ర
100. తో గతవతాం తేషాం దివం తణాత్ దస్మా
101. భర్విహితంప్రి(వృ) థాక్షత మితి క్రీడాభరే
102. ణ ధ్రువంఎఎ (26) బాహైయ్యేవి నచ్చిన్న దండం విప
103. క్షఖోణీంద్రాణాం పాతితం ఛత్రబ్రి(బృ)ం
104. దం॥ పాంసున్నం భాతి సంగ్రామరంగే
105. యద్వత్తేషాం నిఃప్రభం కీర్తి బింబం (27) య
106. ద్భీతి ప్రపలాయితా ప్రి(ప్ర)తినృపా సత్త్యుల్య
107. తాలిప్సయా నూనంభూమి భృతాం మ
108. హాంతి కటకా న్యేకక్షణా దోబ్బలాత్
109. ఆక్రామంతి విశాలసా(శా)లగహనా
110. న్యన్యై రగమ్యాన్యతి స్ఫూర్జా న్నాగకులా
111. కులాని విచర ద్వాజిప్రజానిస్ఫుటం(28)

## మూడవవైపు:

112. యస్యావక్ర పరాక్రమ ప్రణయిన స్సావ
113. ణ పుంఖా శ్శరా స్తీక్ష్ణాగ్రా స్సమరే పు
114. క్షితిపతి వ్రాతం విభిద్య క్షణాత్ భూ
115. మిం సంప్రవిశంతి దుష్టదమనా దస్మా



116. భి రథ్యోద్ధృతః ప్రి(పృథ్వీభార ఇతిధ్రువం
117. కథయితుం వోఢుర్భువం భోగినః
118. ॥(29) యద్దోద్దరింఢోద్ధృతాసి ప్రహతివినిహ
119. తారాతి వీరక్షితీశ స్వల్లో కస్త్రీ వివాహ
120. ప్రతత యవనికా సన్నిభస్సం విభాతి యు
121. ద్ధే సన్నద్ధవాజి ప్రజఖుర విదళ ద్భూసము
122. త్థః పరాగః ఖేవిస్తీర్ణం: కరీంద్రప్రభుర
123. మదజలై శ్ఛిన్నమూలస్సమంతాత్ ఎఎ (30) వీ
124. రారాతి మహాబలప్రమథనిల యస్యాం
125. సి లేఖాస్ఫుటం ధత్తే ధూమరుచిం ప్ర
126. తాప దహనస్యారాతిగోత్రోత్థితాః॥ జ్వా
127. లాభాం రుధిరచ్ఛటశ్చ దధతో వైరీభ కు
128. ంభస్థలా ద్రక్తాక్తానిచ మౌక్తికాని ప
129. తితా న్యంగారశోభాం భువి॥ (31) హారస్తా
130. ర తరోపి రంధ్ర సహితః శక్రస్యదంతా
131. వలః శుభ్రాంగోపి మదాంబుసే కమ
132. లినో హంససితో పిస్ఫుటం॥ ప్రీతిం
133. యాతి జడే సుధాంశు రమల శ్ఛాయో
134. పి దోషాకర స్తంనైతే సదృశా యదీయ
135. యశసా నిర్దోష శుభ్రాత్మనా॥ (32) ఓరుగల్లు
136. పురేయశ్చ శ్రీమద్రుద్ర చమూపతిః
137. రుద్రేశ్వరస్య దేవస్య ప్రతిష్ఠా మకరో
138. (త్కృ)తీ॥ (33) ప్రాదాచ్ఛాస్మై శివాయాథ కామా
139. ంబా తనయస్సుధీః రంగాంగభో
140. గ సిధ్యర్థం గ్రామం నెక్కొండ సంజ్ఞితం: (34)
141. తేనా కారిపురీ తుంగశృంగ ప్రాకా
142. (ర) భాసురా॥ యత్ర రమ్యాణి హ
143. ర్మ్యాణి శాశ్వత్యః సర్వసంపదః॥ (35) శ్రీ
144. మ ద్వారవతీనిత్య మయోధ్యాస గిరి
145. ప్రజా॥ శ్రీవిశాలాచ మధురా స్పష్ట
146. 0 భోగవతీచయా॥ (36) క్వచి దత్రోదగ్ర
147. ద్విపతిబృహద్బృంహితరవఃఎ క్వచిద్వా
148. జివ్రాత ప్రఖరఖుర టంకారనిక
149. రః॥ క్వచిద్వీరవ్యూహ ప్రకృతఖురళీ కే
150. ళీ కలహః క్వచిద్యూత ప్రీత ప్రచుర వి
151. టవాదవ్యతికరః॥ (37) క్వచిద్వీణా వేణు ధ్వ
152. నియుత వధూగాన నినదః క్వచి న్నవ్య
153. శ్రవ్యమది మయుతపర్వప్రపఠ
154. నం క్వచి ద్విప్రవ్రాత స్ఫుటకృత చతుర్వే
155. ద గుణనం క్వచి చ్ఛాస్త్రాభ్యాస వ్యసని



156. సదుపన్యాస విభవః॥ (38) యస్యా శ్రీయ
157. మివద్రష్టుం తాంబూల లతికాద్రు
158. తం॥ ఉద్యానపూగ స్కంధాగ్రాణ్యారో
159. హంతీ సమం తతః॥ (39) బాడబాగ్ని భ
160. యాయాతః పారావార ఇవస్థి
161. తః తత్పురీ దప్ప9ణనిభస్త డాగ

## నాలుగో వైపు

162. స్తేనకారితః॥ (40) యస్మింనూమ్మి9శ్రేణిభిస్తార్య మా
163. నా స్తోయప్రాంతే ఫేనమాలాః సమంతాత్ వే
164. లా లోలస్ఫారశంఖావళీనాం తుల్యాకారః
165. కుర్వతే సింధుసామ్యం॥ (41) యదీయమంబు ని
166. ఖిలా గృహ్ణంతి ధ్రువ మంబుదాః॥ నసాముద్ర
167. ంయతఃస్వాదు జలం వషరింతి సవ్వరితః (42) యస్యా
168. తి నిమ్మరిళజలం ప్రతిమాచ్ఛలేన తారాః ప్రవిశ్య వి
169. మళాః నిఖిలాః క్షపాసు॥ కువ్వరింతి నూనము
170. దవాసతపః ప్రకామం పూర్ణేన్దువిందునా
171. సహ సమాగమనాయ నిత్యం॥ (43) మందో
172. దంచ త్ప్రచురవిలసల్లోల కల్లోలమాలా
173. దోలా శిలాశిసుఖిత విహగవ్యూహ కాంతే
174. సమంతాత్॥ యత్రోద్ధూతా నమలపృష
175. తాం శ్చాతకా మీన పుచ్ఛైః గ్రీష్మేదూరా ద
176. భి నిపతతో వృష్టి మోహాత్పిబంతి॥ (44) తస్యామ
177. తి రుచిరాయాం పుయ్యారం ప్రతిగండ భైర
178. వస్సోయం॥ రుద్రేశ్వర ప్రతిష్ఠా మకరో ద్వి
179. జేంద్ర సంస్తుత్యాం (45) ప్రాసాదా యస్య సౌ
180. వణ్ణం కుంభః స్పష్టంభాతి ద్యోతితాకాశదేశ
181. : శశ్వత్పూర్వ క్షోణిభ్రి(భృ)త్తుంగ శృంగస్థాయి
182. స్ఫీతాదిత్య బింబప్రకాశః॥ (46) శరలోకేందు
183. భూసంఖ్యే శాకాబ్దే శ్రీముఖే మధౌ॥ శు
184. క్లాష్టమ్యాం భానువారే పుష్యర్క్షేచ (మ)
185. హామతిః॥ (47) రుద్రేశ్వరాయ భోగా (తరం)
186. గౌరీశ సహితాయసః ప్రాదాదు
187. ప్పర్లపల్లించ బొర్లపల్లించ సాదరం॥ (48)
188. మద్వంశాజాః పరమహీపతి వంశజావా పా
189. పాదపేతమనసో భువి భూమిపాలాః
190. తే పాలయంతు మమధమ్మం మిమంసమ
191. స్తం తేషాం మయా విరచితోంజలి రేషమూ
192. ॥ (49) శత్రుణాపి కృతో ధర్మః పాలనీయః -
193. ప్రయత్నతః॥ శత్రురేవహి శత్రుస్స్యాద



194. ర్మశత్రు ర్నకస్యచిత్ ॥ (50) స్వదత్తాం పరద
195. త్తాం వా యోహరేతి వసుంధరాం ఎ ష
196. ష్టింవష సహస్రాణి విష్టాయాం జాయ
197. తేక్రిమిః॥ (51) తస్మా దస్మత్కృతః ప్రీత్యా ధమ్మరి
198. శ్శమ్మని సమృద్ధయే భవద్భి రవనీ పాలాః
199. పాలనీయః ప్రయత్నతః ॥ (52) నిత్యశ్రీమతి
200. సంతుష్యం నాతుకూరిపురేవరే ॥ సుస్థా
201. పితాయ దేవాయ శ్రీమద్రుద్రచమూ
202. పతిః॥ (53) కాటేశ్వరాయ భోగార్థం ప్రాదా త్కామే
203. శ్వరాయచ రుద్రేశ్వరాయచ సుధీనడ్కుడే
204. గ్రామ ముత్తమం॥ (54)

(క్రీ.శ.1213 వ సంవత్సరం మార్చి 31వ తేదీన ప్రస్తుత పాలంపేటలో రేచర్ల రుద్రుడు వేయించిన సంస్కృత శాసనానికి సంక్షిప్త అనువాదం.)

గణపతి దేవునికి విశ్వాసపాత్రుడు, వీరుడు అయిన రుద్రసేనాపతి రేచర్ల వంశానికి చెందినవాడు. ఆ వంశానికి చెందిన బ్రహ్మసేనాని, కాకతీయ ప్రభువు దగ్గర సేనాపతిగా ఉండేవాడు. ఆ వంశంలోనే శతృవులను జయించి సంపదలను పొంది మంచివారికి ఇష్టుడుగా పేరుగాంచిన కాటయ అనే సేనాని జన్మించాడు. ఈ కాటయ కొడుకైన కామసేనాని, కాకతీయ ప్రోలరాజు సైన్యాధ్యక్షునిగా మంథని గుండరాజును ఓడించాడు. కామసేనాని కొడుకు కాటయసేనాని కూడా శూరుడే. ఈ కాటయ కొడుకే రుద్రసేనాపతి (రేచర్ల రుద్రారెడ్డి). యుద్ధంలో రుద్రుని ధాటికి తట్టుకోలేక నాగతి అనే రాజు పరుగులెత్తాడు. రేచర్ల రుద్రుడు ఓరుగల్లులో రుద్రేశ్వరుని ఒక ఆలయాన్ని కట్టి అంగరంగ భోగాలకు నెక్కొండ అనే గ్రామాన్ని దానంగా ఇచ్చాడు.

ఇతడు అందమైన ప్రాసాదాలతో చుట్టూ ఎత్తైన ప్రాకారమున్న ఒక నగరాన్ని నిర్మించాడు. ఆ నగరం సంగీత, సాహిత్యాలతో ఎంతో వైభవంగా వెలుగొందింది. ఆ నగరం పక్కనే తవ్వించిన చెరువు సముద్రాన్ని తలపించటమే కాక తానునిర్మించిన నగరసౌందర్యాన్ని ప్రదర్శిస్తున్న అద్దంలా వుంది. ఈ నగరం మధ్యలో ఒక ఆలయాన్ని నిర్మించి రుద్రేశ్వరుణ్ణి ప్రతిష్టించాడు. ఆ దేవాలయ శిఖరం మీదగల బంగరుకలశం సూర్యకాంతితో సమానంగా ప్రకాశిస్తుంది. శక సంవత్సరం 1135, శ్రీముఖనామ సంవత్సరం మధుమాస వసంత శుక్ల పక్ష అష్టమీ ఆదివారం (31.03.1212) నాడు పుష్యమీ నక్షత్రాన రుద్రేశ్వరాలయంలో రుద్రేశ్వరుని ప్రతిష్టించి ఉప్పర్లపల్లి, బొర్లపల్లి గ్రామాలను దానంచేసి, ఈ దానాన్ని తనతరువాత పానులయే తనకు శతృవులైన వారుకూడా గౌరవించాలని వేడుకొన్నాడు. కాటేశ్వర, కామేశ్వర, రుద్రేశ్వరాలయాల భోగాలకు నడికుడి (ఆంధ్ర ప్రాంతంలోని పల్నాడు జిల్లాలోని నడికుడి) అనే గ్రామాన్ని కూడా దానం చేశాడు.





# 7. రామప్ప చెఱువు

ఈ దేవాలయానికి వెనుక సా.శ. 1213లో దేవాలయంతోపాటు రేచర్ల రుద్రుడు నిర్మించిన గొప్ప చెఱువు నేటికీ వేలాది ఎకరాలకు సాగునీటిని అందిస్తూ 812 ఏళ్లకు పైగా ప్రజలకు జీవనాధారమైంది. రెండు కొండల నడుమ ఎత్తైన మట్టికట్టవేసి అద్భుతమైన జలాశయాన్ని నిర్మించి ఆధునిక శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానానికి సవాలుగా తటాక నిర్మాణ పద్ధతుల్ని పాటించాడు. దేవాలయ, తటాక నిర్మాణాలు ఆనాటి ఇంజనీరింగు నైపుణ్యానికి ప్రతిబింబాలుగా, తెలంగాణాతల్లి కంఠాభరణాలుగా, ప్రపంచ వారసత్వకట్టడాల జాబితాలో చోటు దక్కించుకున్నాయి. ప్రతి రోజూ వందలాది దేశీ, విదేశీ పర్యాటకుల్ని రప్పించుకుంటున్నాయి. ఆధునిక ఇంజనీర్లకు కొత్తకొత్త పాఠాలు నేర్పుతున్నాయి.









# 8. రామప్ప శిల్పం...
# ప్రపంచ సుందరీమణుల ఆశ్చర్యం

ప్రతిష్ఠాత్మక "ప్రపంచ సుందరి 2025" పోటీల వేదికగా తెలంగాణా - హైదరాబాద్ ఎంపిక కావడంతో, ప్రభుత్వం ఈ ప్రపంచ సుందరి ఉత్సవం ఆసరాగా తెలంగాణాలోని వివిధ చారిత్రక, పర్యాటక, ఆధ్యాత్మిక క్షేత్రాలను, కట్టడాలను, వివరాలను ప్రపంచానికి తెలియజెప్పాలని సంకల్పించింది. 2025 మే 10 నుండి 31 వరకు జరిగిన ఈ ప్రపంచ సుందరి' ఉత్సవాలలో పాల్గొనే వివిధ దేశాల సుందరీమణులను తెలంగాణాలోని వివిధ ప్రాంతాలలో పర్యటింపజేయడం జరిగింది.

ఆ క్రమంలో 14 మే, 2025 నాడు యూరప్‌కు చెందిన దాదాపు 30కి పైగా సుందరీమణులు రామప్పను సందర్శించారు. వీరందరికీ తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణ, అలంకరణ చేయడం విశేషం. పోచంపల్లి, నారాయణపేట, గద్వాల చీరల ఓణీలతో, నుదుటన తిలకం, జడలు, జడలలో మల్లెపూలు, కనకాంబరాల హారాలతో అచ్చ తెలుగు తెలంగాణా అమ్మాయిలుగా తీర్చిదిద్దడం జరిగింది. భారతీయ సంప్రదాయంలో తెలంగాణా ఆహార్యంలో కనిపించిన ఈ సుందరీమణులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నారు.

కాగా ఈ సుందరీమణులకు దేవాలయ ఆరంభంలోనే సంప్రదాయ గిరిజన కొమ్ము కోయ నృత్యాలతో ఘన స్వాగతం పలికి రామప్ప దేవాలయ వాస్తు శిల్పం, ఇంజనీరింగ్‌లో అద్భుతాల గురించి వివరించటం జరిగింది. ఆ తర్వాత రామప్ప నేపథ్యంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి దానిపై "కాకతీయ వైభవం - రుద్రమదేవి" నృత్య నాటికను, "సత్యం - శివం - సుందరం" పేరిట ప్రత్యేక పేరిణి నృత్యాన్ని 70 మందికి పైగా కళాకారులతో ప్రదర్శించారు.

రామప్ప శిల్ప సంపదను, మదనికల విన్యాసాలను, సాంస్కృతిక ప్రదర్శనలను చూసిన సుందరీమణులు ఎంతో ఆశ్చర్యపోయి తెలంగాణా చారిత్రక, సాంస్కృతిక వైభవానికి ముగ్ధులైపోయారు.

ఇలా "ప్రపంచ సుందరి" అందగత్తెల రామప్ప సందర్శన **సంస్కృతి - సౌందర్యాల సృజనాత్మకత మేళవింపు**గా రూపొంది, విదేశీయులందరికీ ఒక మరచిపోలేని అనుభూతిని మిగిల్చింది. "రామప్ప దేవాలయం-కాకతీయ వైభవ దర్పణం" అనే మాట ప్రపంచ సుందరీమణుల అభిప్రాయాలలో నుంచి మరోసారి రుజువయింది...!









**తె**లుగుజాతికీ, తెలంగాణ ప్రాంతానికి భారతీయ చరిత్ర ప్రస్థానంలో ప్రత్యేక అధ్యాయాన్ని సృష్టించిన పాలకులలో శాతవాహనుల తర్వాత ప్రస్తుతించతగినవారు కాకతీయులు! కాకతీయ చక్రవర్తులు 1158 సంవత్సరం నుంచి 1323 సంవత్సరం వరకూ దాదాపుగా దక్షిణ భారతదేశాన్ని అంతటినీ ఏలుబడిలోకి తీసుకొచ్చి పాలనలో, వాస్తు శిల్ప రీతులలో, దేవాలయ నిర్మాణ శైలులలో, సాహితీ, సాంస్కృతిక, భాషా పోషణలో తమదైన ముద్రని వేసారు అనడంలో ఎలాంటి సందేహం లేదు.

రామప్ప దేవాలయం, దాని అమరిక ఒక "ఇంజనీరింగ్ మార్వెల్" అని అనిపిస్తుంది. గర్భాలయం, రంగమంటపం, నంది మండపం, చుట్టూ ప్రాకారం, ఇవన్నీ ఒక నిర్దిష్టమైన నిర్మాణ రీతులను కలిగి ఉండి ఈ దేవాలయానికి విశిష్టతను సంతరించిపెడుతున్నాయి. దేవాలయం చుట్టూ ప్రదక్షిణా పథం ఏర్పాటు చేయడం, దేవాలయం ఆకృతి మొత్తం నక్షత్ర ఆకృతిలో, కలువ రేకులు విచ్చుకున్న పద్మాకృతిలో నిర్మాణం అవ్వడం, నిలువెత్తు సుందర నాగిని / మదనిక శిల్పాలు ఒక విశేషం. ఎన్నో విశిష్టతలతో కూడిన రామప్పదేవాలయ విశేషాలను ఈ పుస్తకం సచిత్రంగా వివరిస్తుంది.



తెలంగాణ ప్రభుత్వం
**భాషా సాంస్కృతిక శాఖ**
కళాభవన్, రవీంద్రభారతి, హైదరాబాద్

ISBN 978-81-981195-3-7